క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా చాంద్‌బాషా

మదనపల్లె : మదనపల్లె వన్ టౌన్ సీఐగా ఏ. చాంద్ బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐ బదిలీలలో భాగంగా తిరుపతి ఎస్సీ ఎస్టీ సెల్ విభాగం లో పనిచేస్తున్న చాంద్ బాషా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వలీబాషు అన్నమయ్య జిల్లా రాయచోటి వేకెన్సీ రిజర్వ్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ టౌన్ పరిధిలో శాంతిభద్రతలు పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

మదనపల్లె సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తంకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మదనపల్లె డివిజన్ పరిధిలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. వీటి స్థానంలో విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని డీవైఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు భాస్కర్‌రెడ్డి, షరాఫత్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

కేవీపల్లె : బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పని పీలేరు కార్మిక శాఖ అధికారి ఆనందబాబు అన్నారు. మంగళవారం మండలంలోని కేవీపల్లె, గర్నిమిట్టలో బాల కార్మిక నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఎన్‌సీసీ గది ఏర్పాటు

పీలేరు : స్థానిక నెహ్రూబజార్‌లోని జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఎన్‌సీసీ గది నిర్మించి మంగళవారం ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయులు రవీంద్రనాథరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి ముగ్గురు కలసి ఎన్‌సీసీ గది నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం అందజేశారు. గదిని ప్రారంభించిన ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణకు, సేవాభావానికి, క్రమశిక్షణకు మారుపేరన్నారు. ఎన్‌సీసీ కోటాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహాలకు శుద్ధి

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం బసినికొండలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని, విగ్రహాలను మంగళవారం హిందూ చైతన్య వేదిక సభ్యులు శుభ్రం చేశారు. శ్రావణ మాసాలు ప్రారంభం కానుండటంతో హిందూ చైతన్య వేదిక బాలాజీ ఆధ్వర్యంలో ఆలయంకు వెళ్లే దారుల్లో చెట్లు తొలగించారు. రోడ్లపై ఉన్నే చెత్తాచెదారం ఎత్తివేశారు. ఆలయంలోని విగ్రహాలతో పాటు ఆలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్, ఆదినారాయణ, భాస్కర పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు వెంకటరెడ్డి



వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్.సేతు, హేమంత్

మదనపల్లె : ఎంతో మంది విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతూ, 35 ఏళ్లగా విద్యా సేవలో తరిస్తున్న ఈ.వెంకటరెడ్డి అందరికీ ఆదర్శప్రాయులని విజయభారతి కరస్పాండెంట్ డాక్టర్.ఎన్.సేతు అన్నారు. మంగళవారం శ్రీ సిద్దార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఈ.వెంకటరెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక వెంకటరెడ్డి శ్రీ సిద్దార్థ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యాసంస్థల అధినేతలు ఈ.వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ఆవరణలో కేక్ కట్‌చేసి, వెంకటరెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు.

క్రీడా కుసుమాలు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ
- సత్తాచాటుతున్న జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

బాల్యం నుంచి అభిరుచి కలిగిన రంగంలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టుగానే పట్టుదలతో సాధన చేశారు. కఠోర శ్రమ, క్రమశిక్షణతో క్రీడారంగంలో ప్రతిభ చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తూ అందరి చేత మన్ననలు పొందుతున్నారు మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు.

– మదనపల్లె సిటీ



హాకీ ఆడుతున్న విద్యార్థులు

హ్యాండ్‌బాల్ పోటీల్లో దిట్ట రామ్



చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు రామ్. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి హ్యాండ్‌బాల్‌లో పట్టు సాధించాడు. అండర్–17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాణిస్తున్నారు.

నెట్‌బాల్‌లో రాణిస్తున్న అభిలాష్



నెట్‌బాల్ క్రీడల్లో అభిలాష్ రాణిస్తున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. పీఈటీ నాగరాజు, నరేష్‌ల సహకారంతో నెట్‌బాల్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఎస్‌జీఎఫ్–14 తొమ్మిదవ నెట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగిన పోటీలకు వెళ్లి ప్రతిభ కనబరిచారు.

బాల్ బాడ్మింటన్‌లో రాణిస్తున్న రూప



బాడ్మింటన్ క్రీడలో రూప రాణిస్తుంది. చిన్నప్పటి నుంచి క్రీడలపై మమకారంతో పీడీల సహకారంతో బాల్‌బాడ్మింటన్ పోటీల్లో దూసుకెళుతుంది. పదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి అండర్–17 రాష్ట్ర స్థాయి జట్టు తరఫున కర్నూలులో ఆడి మంచి ప్రతిభ కనబరిచారు.

హాకీలో సత్తా చాటుతున్న వెంకట్‌సాయి



హాకీలో వెంకట్‌సాయి సత్తా చాటుతున్నారు. పదో తరగతి చదువుతున్న వెంకటసాయి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. పీడీలు నరేష్, నాగరాజల సలహాలతో హాకీ క్రీడలో రాణిస్తున్నారు. పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే లక్ష్యం



విద్యార్థులను అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా తయారు చేయడమే లక్ష్యం. అందుకు తగ్గట్టుగా క్రీడాకారులకు రోజు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. క్రీడల్లో సాధన చేస్తే నిరంతరం చురుగ్గా ఉండటంతో పాటు చెడు అలవాట్ల బారిన పడకుండా బాగా చదువుతారు. పాఠశాలలో విద్యార్థులు అన్ని క్రీడల్లో రాణిస్తున్నారు.

– నరేష్, పీడీ, జెడ్పీహెచ్‌ఎస్.సిటీఎం

మెరుగైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్‌ఓ కొండయ్య



పెద్దతిప్పసముద్రం పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య సూచించారు. మంగళవారం ఆయన పీటీఎం, కందుకూరు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీల్లోని రిజిస్టర్, హాజరు పట్టికలు, ఆసుపత్రికి వచ్చే రోజువారి రోగుల సంఖ్య, వ్యాక్సిన్ గది, కాన్పుల గది, మందులు నిల్వ చేసే గదులను పరిశీలించారు. పీటీఎం పీహెచ్‌సీ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న రక్త పరీక్షా భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్షించి పలు సూచనలిచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను నిత్యం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు పరిసరాల శుభ్రత, మురుగునీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాక మునుపే వ్యాధులను ముందే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది పీహెచ్‌సీల్లో రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కందుకూరు, పీటీఎం పీహెచ్‌సీల డాక్టర్లు శంకర్, యస్తానీతో పాటు సిబ్బంది ఉన్నారు.

పండగ వాతావరణంలో పంద్రాగస్టు వేడుకలు

- దేశభక్తి ఉట్టిపడేలా, ఘనకీర్తిని చాటేలా ఉత్సవాలు
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను చారిత్రాత్మక మదనపల్లె పట్టణంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం స్వాతంత్రదినోత్సవ ముందస్తు వేడుకల ఏర్పాట్లు, నిర్వహణపై స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో డీఎస్పీ డి.కొండయ్యనాయుడుతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై ఈనెల 9న ప్లానింగ్ సమావేశం, 12న డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ, 13న పాఠశాల విద్యార్థుల ర్యాలీ, 14వతేదీ సాయంత్రం పట్టణంలోని అనిబిసెంట్ సర్కిల్ నుంచి కాగడాల ర్యాలీ ప్రారంభించి, మిషన్ కాంపౌండ్ వద్దకు చేరుకుని, ముందస్తు స్వాతంత్రదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా, స్వాతంత్ర స్ఫూర్తిని గుర్తుకుతెచ్చేలా ఘనంగా నిర్వహిస్తున్న వేడుకలకు జిల్లా మంత్రి, కలెక్టర్, ఎస్పీ, ఇతర ఎమ్మెల్యేలందరిని ఆహ్వానిస్తామన్నారు. పండుగ వాతావరణంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకరరెడ్డి, జ్ఞానాంబిక ఆర్.గురుప్రసాద్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ కొండయ్యనాయుడు



మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె సిటీ : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కొండయ్యనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కంట్రోల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్లను సీనియర్లు సోదరభావంతో ఆహ్వానించాలని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్ వాడకూడదని, దాని వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. డ్రగ్స్ వాడటం వల్ల జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. కాలేజీని డ్రగ్స్ రహిత, ర్యాగింగ్ రహిత కాలేజీని వివరించారు. కాలేజీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తాలూకా సిఐ శేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, కాలేజీ ప్రిన్సిపల్ సతీష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాగింగ్ చేయమని, డ్రగ్స్ వాడకూడదని వాగ్దానం చేయించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్కౌట్ విద్యార్థులు



స్కౌట్ విద్యార్థులు సంతోష్ రెడ్డి, ఉదయ్ చరణ్

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సంతోష్ రెడ్డి, ఉదయ్ చరణ్‌లు ఆగస్టు 15న రాయచోటి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సావిత్రి, స్కౌట్ మాస్టర్ రవీంద్ర రెడ్డి తెలిపారు. ఎంపికైన ఈ విద్యార్థులు ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రాయచోటిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మార్చ్ ఫాస్ట్ శిక్షణ తరగతులకు హాజరై తర్ఫీదు తీసుకోనున్నట్లు తెలిపారు. సేవా దృక్పథం, దేశభక్తికి మారుపేరు స్కౌట్ అండ్ గైడ్స్ అని, ఇది విద్యార్థులలో క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. జిల్లా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాఠశాల విద్యార్థులు పాల్గొనడం గర్వకారణమని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దమండ్యం : పక్కాగృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య లబ్ధిదారులను కోరారు. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెలో పక్కాగృహాల నిర్మాణం పనులను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. వివిధ దశలలో ఉన్న పక్కాగృహాలను బిల్లుల చెల్లింపులపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు సకాలంలో చెల్లించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి శైలజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి శేషాద్రి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చుండూరు దళిత మృతవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు రూరల్ : గుంటూరు జిల్లా చుండూరులో 33 ఏళ్ల క్రితం ఊచకోతకు గురైన దళిత మృతవీరులకు మాల మహానాడు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద చుండూరు మృత వీరుల చిత్రపటాలను ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దళితులు అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. దళితులపై తరచూ దాడులు, అత్యాచారాలు, కుల దూషణలు, అంటరానితనం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ధరణికుమార్, గట్టప్ప, సుభాష్, చిన్న, మల్లికార్జున, లోకనాథం, రవికుమార్, వెంకటరమణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈ- క్రాప్ నమోదు



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : మండలంలో ఈ క్రాప్ నమోదు పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 15లోపు వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీలు విజయకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆర్ఐ చాణక్య, ఏవో రమాదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గేట్‌లో రాణిస్తే త్వరగా ప్రభుత్వ ఉద్యోగాలు

ఎల్‌అండ్‌టీ ఇంజనీరు సాయి చరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సాయిచరణ్‌రెడ్డి

కురబలకోట : జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్ పరీక్షలో ఈఈఈ విద్యార్థులు రాణిస్తే వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు త్వరితగతిన లభిస్తాయని ఎల్ అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ బెంగళూరు శాఖ ఇన్వర్టర్ ఇంజినీరు సాయి చరణ్ రెడ్డి అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కోర్ కంపెనీలలో ఈఈఈ విద్యార్థులకు అవకాశాలపై మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే ఈబ్రాంచ్ విద్యార్థులకు కోర్ కంపెనీ ఉద్యోగాల్లో మెరుగైన జీత భత్యాలు ఉంటాయన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ పరిశ్రమ, ఆటోమేషన్, కంట్రోల్ సిస్టమ్స్, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

– మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్



రక్తదానం చేసిన విద్యార్థికి గుర్తింపు పత్రం అందచేస్తున్న సబ్ కలెక్టర్

కలికిరి: విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ రక్తదాన శిబిరం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండాలని, ఆరోగ్య వంతుల రక్తదానం ఆపదలో మరొకరి ప్రాణం కాపాడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు వింత పోకడలకు అలవాటు పడి టాటూలు వేయించుకుంటున్నారని, దీంతో భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. అటువంటి వారు రక్తదానం చేయడానికి వీలుండదన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ అపర్ణ, వైద్యాధికారిణి సనా ఆయేషా, సిబ్బంది రేవతి, కేశవకుమార్, నూర్‌మొహమ్మద్, ప్రవీణ్, రజని, లావణ్య, చాంద్‌బాషా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత ఇసుక అందించేందుకు చర్యలు


ఎమ్మెల్యే పేరుతో ఇసుక దందాలు సాగిస్తే క్రిమినల్ కేసులు

మదనపల్లె : రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించిన నేపథ్యంలో పేదలందరికీ ఉచితంగా ఇసుకను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవననిర్మాణరంగానికి పూర్వవైభవం తెచ్చేలా, కూలిలందరికీ ఉపాధి దక్కేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారన్నారు. సామాన్యుడిపై ఇసుక భారం లేకుండా చేశామన్నారు. ప్రస్తుతం కొంతమంది టిప్పర్ యజమానులు, నాయకులు ఎమ్మెల్యే పేరు చెప్పుకుని అక్రమంగా ఇసుక దందాలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక అక్రమరవాణాలో టీడీపీ నాయకులు ఉన్నా ఉపేక్షించేది లేదని, తప్పకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, పులిమహాలక్ష్మి, రాధ, నాదెళ్ల శివ, షోయబ్‌సీను, కత్తిలక్ష్మన్న, జేసీబీ వేణు, నందిని తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి మాన్యం భూములు ఎండోమెంట్‌కు

మదనపల్లె : పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీ వెనుక వైపున ఉన్నటువంటి ఆంజనేయస్వామి మాన్యం భూములు ఎండోమెంట్‌కు చెందుతాయని హైకోర్టు తీర్పు వెలువరించినట్లు ఆలయట్రస్ట్ సభ్యులు నవీన్‌చౌదరి, రమేష్‌లు తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ... పట్టణ నడిబొడ్డున కోట్ల విలువ చేసే ఆలయ మాన్యం భూములను కొందరు ఆక్రమించుకుని, అవి తమకే చెందుతాయని హైకోర్టుకు వెళ్లడంతో, దానిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. దీనిపై హైకోర్టు జడ్జి .. మాన్యం భూములు ఎండోమెంట్ పరిధిలోకి తీసుకోవచ్చని తీర్పు ఇచ్చారన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి



క్రిష్టారెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మాదు క్రిష్టారెడ్డి (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడు ఉమ్మడి బూర్లపల్లి గ్రామ పంచాయతీ ఆవిర్భావం అయిన తరువాత మొదటిగా ఎన్నికైన సర్పంచ్. గతంలో కాంగ్రెస్ పార్టీలోనే రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా మరో విడత ఎన్నికల ద్వారా సర్పంచ్ అయ్యారు. 15 ఏళ్ళ పాటు సర్పంచ్‌గా కొనసాగిన ఈయన తంబళ్ళపల్లిలోని టీఎన్ కుటుంబీకులకు అత్యంత సన్నిహితుడు. ఈ నేపథ్యంలో పార్టీలకతీతంగా నాయకులు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

'కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తా'

మదనపల్లె సిటీ: సొంత నిధులతో కాలేజీకి కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేశారు. కాలేజీలో అయిదు అదనపు తరగతి గదుల భవనాల ఏర్పాటు, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి

కేవీపల్లె : ఆరోగ్య సంరక్షణపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశిరీష, పారా లీగల్ గట్టప్ప అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లేళ్లమంద పెద్ద తాండాలో లీగల్ అవగాహన సదస్సులో భాగంగా న్యాయం, సామాజిక, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 42 మందికి వైద్యసేవలందిచి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

'డీకేటీ భూములు రీవెరిఫికేషన్ చేయాలి'

రామసముద్రం: మండలంలో ఇది వరకు ఇచ్చిన డీకేటీ భూములపై రీవెరిఫికేషన్ చేయాలని తహసీల్దార్ నిర్మాలాదేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో సుమారు 946 ఎకరాల డీకేటీ భూములను రీవెరిఫికేషన్ చేయాలన్నారు. వీఆర్వోలు టీములుగా వెళ్లి గ్రామాల్లో విచారించి, పరిశీలన చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పంట నమోదుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మదనపల్లె సిటీ: రైతులు ఈ పంట నమోదు వారి రైతు సేవా కేంద్రాల్లో చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ శివశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. సెప్టెంబర్ నెలాఖరులోపు నమోదు చేసుకోవాలన్నారు. నమోదును ప్రామాణికంగా తీసుకుని ధాన్యం, విత్తనాల కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగప్రసాద్, హార్టికల్చర్ అధికారి ఈశ్వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సహాయ సాంఘిక సంక్షేమ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కమలాకర్ మాట్లాడుతూ బీసీ,ఎస్సీ,ఎస్టీ వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. కాస్మోటిక్ చార్జీలను విడుదల చేసి, ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా ధరలను పెంచాలని, బాలికల వసతి గృహాల వద్ద సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు.